

# హార్దిక్‌కు బ్రహ్మరథం!

వడోదరాలో ఘన స్వాగతం

వడోదరా: వెస్టిండీస్ వేదికగా ఇటీవలే ముగిసిన ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలువడంలో కీలకంగా వ్యవహరించిన హార్దిక్‌పాండ్యాకు సొంతగడ్డపై ఘన స్వాగతం లభించింది. 17 ఏండ్ల సుదీర్ఘ కల సాకారమైన వేళ..పాండ్యాకు వడోదరలో అభిమానులు బ్రహ్మరథం పట్టారు. మెగాటోర్నీ గెలిచిన తర్వాత తొలిసారి సొంత ఇలాఖాకు వచ్చిన పాండ్యాను ఫ్యాన్స్ మంగళవారం భారీగా ఊరేగించారు. రోడ్డుకు ఇరువైపులా బారులు తీరిన అభిమానులు..హార్దిక్ హార్దిక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. అభిమానుల హోరు మధ్య పాండ్యా ఓపెన్‌బస్‌లో అభివాదం చేశాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

# వేడుకగా ఎంబాపె 'మ్యాడ్రిడ్' రాక



మ్యాడ్రిడ్: ఫ్రాన్స్ సారథి కిలియన్ ఎంబాపె దిగ్గజ ఫుట్‌బాల్ ఫ్రాంచైజీ 'రియల్ మ్యాడ్రిడ్'తో చేరాడు. ఏడేండ్ల పాటు పారిస్ సెయింట్ జర్మన్ (పీఎస్‌జీ)కు ఆడిన ఎంబాపె.. గతేడాదే రియల్ మ్యాడ్రిడ్‌తో ఒప్పందం కుదుర్చుకుని ఈ ఏడాది జూన్‌లోనే ఈ ఫ్రాంచైజీతో కలిసినా మంగళవారం ఇక్కడి శాంటిగో బెర్నాబ్యూ స్టేడియం వేదికగా సుమారు 80వేల మంది అభిమానుల సమక్షంలో అధికారికంగా 'మ్యాడ్రిడ్'కు మారాడు. ఎంబాపె పరిచయ కార్యక్రమంగా జరిగిన ఈ వేడుకలో ఫ్రాంచైజీ యజమాని ఫ్లొరెంటినో పెరెజ్.. అతడిని అభిమానులను పరిచయం చేయడమే గాక 9వ నెంబర్ జెర్సీ అందించాడు. ఈ సందర్భంగా ఎంబాపె మాట్లాడుతూ.. 'నా జీవితంలో ఇది ప్రత్యేకమైన రోజు. చిన్నప్పట్నుంచీ మ్యాడ్రిడ్‌లో ఆడాలనేది నా కల. ఈ వేడుకను నాతో కలిసి చేసుకున్న మీ అందరికీ ధన్యవాదాలు' అని తెలిపాడు.

## ఆసియా కప్‌లో మహిళలకు ఉచిత ప్రవేశం

కొలంబో: శుక్రవారం నుంచి దంబుల్లా వేదికగా జరగాల్సి ఉన్న ఉమెన్స్ ఆసియా కప్‌లో మ్యాచ్‌లను వీక్షించేందుకు గాను మహిళలకు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు. ఈ మేరకు శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) మంగళవారం ఎక్స్ (ట్విటర్)లో ఒక ప్రకటన ద్వారా ఈ విషయాన్ని వెల్లడించింది. మొత్తం 8 జట్లు పాల్గొనబోయే ఈ టోర్నీలో 15 మ్యాచ్‌లు ఆడనుండగా భారత్.. శుక్రవారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడబోయే మ్యాచ్‌తో టైటిల్ వేటను ఆరంభించనుంది.

## పారిస్ ఒలింపిక్స్‌లో మహిళలకు 'నర్సరీ'

పారిస్: పారిస్ ఒలింపిక్స్‌లో మహిళా అథ్లెట్లకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గత ఒలింపిక్స్‌కు పూర్తి భిన్నంగా మహిళా ప్లేయర్ల అవసరాలకు పెద్దపీట వేశారు. ముఖ్యంగా మాతృత్వపు అనుభూతిని పొందేందుకు ఒలింపిక్స్ గేమ్స్ విలేజ్‌లో ప్లేయర్ల కోసం నర్సరీలు స్థాపించారు. ఓవైపు తమ తమ దేశాల తరపున ప్రాతినిధ్యం వహించడంతో పాటు తమ పిల్లలతో కలిసి ఉండే విధంగా ఏర్పాటు కల్పించారు. పిల్లలకు పాలు పట్టించడం, వాళ్లతో కలిసి సరదాగా గడపడం, కుటుంబంతో మమేకం అయ్యేందుకు ఇవి దోహదపడనున్నాయి.




9 రోజుల్లో

## కీర్తి, ప్రతిష్ఠలతో కోహ్లీ మారిపోయాడు: మిశ్రా



ఢిల్లీ: భారత స్టార్ క్రికెటర్ విరాట్‌కోహ్లీపై మాజీ ప్లేయర్ అమిత్‌మిశ్రా సంచలన వ్యాఖ్యలు చేశాడు. కోహ్లీ, రోహిత్‌శర్మ వ్యవహారశైలిలో చాలా వైరుధ్యం ఉందని చెప్పుకొచ్చాడు. ఒక యూట్యూబర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. 'విరాట్, రోహిత్‌ను చాలా ఏండ్లుగా చూస్తున్నాను. వారిద్దరి వ్యవహార శైలి చాలా భిన్నంగా ఉంటుంది. కెరీర్ మొదట్లో అణుకువగా ఉన్న కోహ్లీ ప్రస్తుతం చాలా మారిపోయాడు. స్టార్ క్రికెటర్‌గా ఎదిగిన తర్వాత మేము మాట్లాడుకోవడం తగ్గిపోయింది. ఒకసారి కీర్తి, ప్రతిష్ఠలు వచ్చిన తర్వాత కొంతమంది ఏదో ఒక రకంగా దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తారని అనుకుంటారు. 14 ఏండ్ల వయసు నుంచే చీకూ(కోహ్లీ ముద్దుపేరు) తెలుసు. చీకూకు కోహ్లీకి తేడా బాగా ఉంది. అదే రోహిత్‌శర్మ ఎప్పుడు కనిపించినా నవ్వుతూ జోక్‌లు చేస్తూ సరదాగా ఉంటాడు. కోహ్లీ, రోహిత్‌కు ఉన్న తేడా అదే' అని అన్నాడు.

## నాగల్ @ 68

ఢిల్లీ: భారత యువ టెన్నిస్ ఆటగాడు సుమిత్ నాగల్ ఏటీపీ ర్యాంకింగ్స్‌లో అదరగొడుతున్నాడు. గత కొంత కాలంగా ఒక్కో టోర్నీలో నిలకడైన ప్రదర్శనలతో రాణిస్తున్న నాగల్ తాజాగా 5 స్థానాలు మెరుగుపరుచుకుని 68వ ర్యాంక్‌కు చేరాడు. కెరీర్‌లో అతడికిదే అత్యుత్తమ ర్యాంకు. భారత్ టెన్నిస్ చరిత్రలో ఏటీపీ ర్యాంకింగ్స్ జాబితాలో నాగల్‌ది నాలుగో బెస్ట్ ర్యాంకు కావడం విశేషం. 1980లో విజయ్ అమృత్‌రాజ్ (18వ ర్యాంకు), రమేశ్ కృష్ణన్ (1985లో 23), సోమ్‌దేవ్ (2011లో 62) తర్వాత నాగల్ నిలిచాడు.

# 'డబుల్ డిజిట్' సాధ్యమేనా?

రెండంకెల పతకాలపై భారీ అంచనాలు • పారిస్ ఒలింపిక్స్‌లో ఆశలు రేపుతున్న క్రీడాకారులు





ఢిల్లీ: ప్రపంచ క్రీడా చరిత్రలో అత్యంత పురాతనమైన క్రీడా పండుగ అయిన 'ఒలింపిక్స్'కు మరికొద్దిరోజుల్లో తెరలేవనుంది. పారిస్ నగరం ఆతిథ్యమిస్తున్న విశ్వక్రీడల్లో సత్తా చాటేందుకు ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే వేలాది మంది క్రీడాకారులు 'ఒలింపిక్ విలేజ్'కు చేరుకుని పతకాలను కొల్లగొట్టేందుకు రాత్రింబవళ్లూ శ్రమిస్తున్నారు. నాలుగేండ్లకోమారు జరిగే ఈ విశ్వక్రీడా సంరంభానికి భారత్ ఈసారి 113 మందితో కూడిన క్రీడాకారుల బృందాన్ని పారిస్‌కు పంపింది. విశ్వక్రీడా యవనికపై మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేస్తారని 140 కోట్ల మంది ప్రజలు ఆశిస్తున్న వేళ ఈ బృందంపై ఈసారి భారీ అంచనాలే ఉన్నాయి. 128 ఏండ్ల ఒలింపిక్స్ చరిత్రలో ఇప్పటివరకూ ఏ ఒక్క ఎడిషన్‌లోనూ 'రెండంకెల మార్కు'ను చేరకపోయిన మన క్రీడాబృందం ఈసారైనా 'డబుల్ డిజిట్'ను దాటేనా?

### గతమేమీ ఘనం కాదు..

1896లో మొదలైన ఆధునిక ఒలింపిక్స్ చరిత్రలో భారత్ ప్రాతినిధ్యం 1900 నుంచి ఆరంభమైంది. అయితే ఈ క్రీడల్లో పాల్గొన్న నార్మన్ ప్రిచర్డ్ బ్రిటన్ దేశస్తుడు. అప్పటికీ మనదేశం బ్రిటీష్ పాలనలో ఉండటంతో నార్మన్ ఇక్కడే పుట్టి పెరిగి మనకు పతకం తీసుకొచ్చినా అతడు భారతీయుడు కాదు! ఒలింపిక్స్‌లో ఒక గుర్తింపు దేశంగా భారత్ 1920 నుంచి అధికారికంగా పాల్గొంటున్నా మనం పతక బోణీ కొట్టింది మాత్రం 1928లో. ఆ ఏడాది అమెస్టర్‌డామ్ ఒలింపిక్స్‌లో హాకీలో మనకు స్వర్ణం లభించింది. అధికారికంగా మనకు ఇదే తొలి పతకం. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత 1948లో లండన్ ఒలింపిక్స్‌లోనూ హాకీలోనే భారత్ గోల్డ్ కొట్టింది. 1928 నుంచి 2008 బీజింగ్ ఒలింపిక్స్ దాకా మన పతకాల సంఖ్య 1, 2 వద్దే ఊగిసలాడేది. కానీ బీజింగ్‌లో 3 పతకాలు సాధించిన భారత్ 2012 లండన్‌లో 6 పతకాలు సాధించి దానిని కాస్త మెరుగుపరుచుకుంది. కానీ 2016 రియోలో మళ్లీ 2 పతకాలకే పరిమితమైంది. అయితే 2020 టోక్యో ఒలింపిక్స్‌లో అత్యధికంగా 7 పతకాలు సాధించడమే ఈ క్రీడల్లో భారత్‌కు ఇప్పటి వరకూ అత్యుత్తమ ప్రదర్శన.





### వీళ్లమీదే ఆశలు..

పారిస్‌కు 113 మందిని పంపిన భారత్ ఖచ్చితంగా పతకాలు కొట్టగలమనే భావిస్తున్న వాటిలో షూటింగ్, రెజ్లింగ్, బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, హాకీ, ఆర్చరీ, అథ్లెటిక్స్ (జావెలిన్ త్రో) ఉన్నాయి. టోక్యో ఒలింపిక్స్‌లో 'గోల్డెన్ త్రో'తో భారత క్రీడారంగంలో సంచలనంగా మారిన నీరజ్ చోప్రా మీద మరోసారి భారీ ఆశలున్నాయి. ఈసారి 90మీటర్ల మీద గురిపెట్టిన ఈ హర్యానా కుర్రాడు ఆ మేరకు పూర్తి సన్నద్ధమయ్యాడు. షూటింగ్‌లో మనూ బాకర్, సిఫ్ట్‌కౌర్ సమ్రా, తెలంగాణ అమ్మాయి ఇషా సింగ్‌పై భారీ అంచనాలున్నాయి. ఇటీవలే ముగిసిన ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో మెరిసిన దీపికా కుమారి, ధీరజ్, జ్యోతి సురేఖ, తరుణ్‌దీప్ రాయ్ విశ్వక్రీడల్లో కొరియన్ల ధాటికి నిలబడగలరా? అనేది కీలకం. బాక్సింగ్‌లో నిఖత్, లవ్లీనా, అమిత్ పంగల్ పతక పంచ్ విసిరేందుకు సిద్ధమవుతున్నారు. బ్యాడ్మింటన్‌లో డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు హ్యాట్రిక్ మెడల్‌పై గురిపెట్టగా ప్రణయ్, లక్ష్యసేన్ సైతం పోటీలో ఉన్నారు. గత రెండేండ్లుగా నిలకడగా ఆడుతున్న సాత్విక్-చిరాగ్ ద్వయంపైనా భారీ ఆశలున్నాయి. గతేడాది కాంస్యం గెలిచిన భారత హాకీ జట్టు ఈసారి పతకం రంగు మార్చాలని భావిస్తోంది. టేబుల్ టెన్నిస్‌లో వెటరన్ శరత్ కమల్, ఆకుల శ్రీజ, మనికా బత్రా పతకంపై ఆశలు రేపుతున్నారు. వెయిట్ లిఫ్టింగ్‌లో మీరా బాయి చాను మరోసారి భారత అభిమానుల పతక ఆశల బరువును మోసేందుకు సిద్ధమవుతోంది. భారత్ తప్పకుండా మూడు, నాలుగు పతకాలు ఆశిస్తున్న రెజ్లింగ్‌లో అంతిమ్ పంగల్, వినేశ్ ఫోగట్, అమన్ సెహ్రావత్, అన్షు మాలిక్ బృందం పతక పట్టు జారవిడవకుంటే భారత్ పంట పండినట్టే. వీరితో పాటు మిగిలిన క్రీడాకారులు తమ స్థాయికి మేర సత్తా చాటితే భారత్ కోరుకుంటున్న డబుల్ డిజిట్ పెద్ద కష్టమేమీ కాదు.

## వాళ్లతో పోటీపడగలమా?

2030 నాటికి భారత్ ఐదు ట్రిలియన్‌ల ఆర్థిక వ్యవస్థ అవుతుందని, అమెరికా, చైనా, జపాన్‌తో పోటీపడుతున్నామని చెప్పుకుంటున్నా క్రీడల్లో వాళ్లతో పోల్చితే మనం దారుణ స్థితిలో ఉన్నామన్నది కండ్ల ముందు కనబడుతున్న చేదు నిజం. అమెరికా ఇప్పటి దాకా గెలిచిన పతకాల సంఖ్య 2,985. ఆ జాబితాలో జర్మనీ (1,083), యూకే (965), ఫ్రాన్స్ (910), చైనా (713), జపాన్ (575) మనం కన్నెత్తి కూడా చూడని స్థాయిలో ఉన్నాయి. 124 ఏండ్లలో భారత్ సాధించిన పతకాలు 35 మాత్రమే. ఆర్థికంగా, జనాభాపరంగా, వనరుల పరంగా మనకంటే అత్యంత అధ్వాన స్థితిలో ఉన్న కెన్యా సాధించిన పతకాలు 113. జమైకా (88), ఇథియోపియా (58) వంటి దేశాలు మన కంటే ఎన్నో రెట్లు మెరుగ్గా ఉన్నాయి.






Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.